క్లుప్తంగా

తుంగమడుగులో వైఎస్సార్ కంటి వెలుగు



తుంగుమడుగులో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: వెదురుపట్టు పంచాయతీ తుంగముడుగ గ్రామంలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు లలిత్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలకు రెఫెర్ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుధాకర్, అమరావతి, పావని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతర నిర్వహణపై సమీక్ష

చిల్లకూరు: ముత్యాలమ్మ జాతర నిర్వహణపై ఈనెల 25న తూర్పుకనుపూరులో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మార్చి 14 నుంచి 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా జాతర నిర్వహించనున్నారు. జాతరకు నాలుగు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీంతో అత్యంత పటిష్ట భద్రతా చర్యలతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

దక్కిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న శుక్రవారం ఉదయం 10–30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.


పక్కాగా రీసర్వే చేపట్టాలి



కల్లూరు సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

దొరవారిసత్రం: రీసర్వే నిర్వహించే ప్రాంతాల్లో రికార్డుల నిర్వహణ, సర్వే పనులు పక్కాగా చేపట్టాలని రెవెన్యూ అధికారులను సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఆర్డీఓ చంద్రముని రనాల్ ఆదేశించారు. ఆయన బుధవారం కల్లూరు సచివాలయాన్ని సందర్శించి సూరగుంతాగేలి, అడపముడి, మానేరి గ్రామాలకు చెందిన రీసర్వే పనులుపై సంబంధిత అధికారులతో చర్చించారు. సర్వేకు చెందిన రికార్డులు తనిఖీ చేశారు. రీసర్వే విషయంలో ఎక్కడ ఏలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మండల సర్వేయర్ రామారావు, వీఆర్వో మధు, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి



యోహాను (ఫైల్)

ఓజిలి: మండలంలోని పున్నెపల్లి రెవెన్యూ పరిధిలో పనిచేసే వీఆర్‌ఓ బుధవారం గుండెపోటుతో మృతిచెందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పున్నెపల్లి రెవెన్యూలో వీఆర్‌ఓ కాపులూరు యోహాను(51). గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా అతనిని కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. అక్కడ కోలుకున్నప్పటికీ మళ్లీ గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతినికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

గూడూరు: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వెంకటకృష్ణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సనత్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, ధనంజయరెడ్డి, కిషోర్‌రెడ్డి, హరనాథ్ రెడ్డి, సిద్ధారెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రజాలంతో ప్రజల్లో చైతన్యం

- సూళ్లూరుపేట మాయలోడు ఎంఎస్ రెడ్డి
- నేడు ప్రపంచ మ్యాజిక్ డే..



కడుపులోకి కత్తిని పోనిస్తూ ఇంద్రజాలం



అవార్డుతో సత్కరిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)



ముఖ్యమంత్రికి ఇత్తడితో చేయించిన రాకెట్‌ను ఇస్తున్న ఎంఎస్‌రెడ్డి

సూళ్లూరుపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించి ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా ఇంద్రజాలం చేయడం ఆధునిక విజ్ఞాన ప్రపంచానికి శుభసూచకమని చెప్పొచ్చు. మహానగరాలకు, పట్టణాలకు పరిమితమైన ఇంద్రజాల ప్రదర్శనలు ఇంద్రజాలకుల ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం ప్రదర్శనలు ఇస్తున్నారు. ఏదో నాలుగు మాటలు ఉచ్చరించి చేతిలో విభూదిని తెప్పించి దైవాంశ సంభూతులుగా తమకు తామే స్వాములమని ప్రకటించుకుని అమాయకులను మోసం చేస్తున్న దొంగస్వాములకు ఇంద్రజాల ప్రదర్శనలు విరుగుడు మంత్రాలవుతున్నాయి. ఎవరైనా అనారోగ్యం పాలైనపుడు, ఇంట్లో పరిస్థితులు బాగాలేనపుడు దొంగస్వాములు మంత్రతంత్రాల పేరుతో చేసే మోసపూరితమైన విద్యలన్నీ టక్కు టమార విద్యలేనని ఇంద్రజాలకులు తమ ప్రదర్శనల్లో ప్రత్యక్షంగా నిరూపిస్తూ ప్రజల్ని చైతన్య వంతుల్ని చేస్తున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం ఎక్కడ ఏ చిన్న ఉత్సవాలు జరిగినా సాంస్కృతిక కార్యక్రమాలుంటే అందులో ఖచ్చితంగా ఇంద్రజాల ప్రదర్శన తప్పకుండా వుంటుంది. ప్రజలు కూడా ఇలాంటి ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకిస్తుంటారు. దీన్ని కనికట్టు విద్య అని కూడా అంటారు.

ఇంద్రజాలంపై మక్కువ..

నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా తప్పటడుగులతో ఈ విద్యను నేర్చుకుంటున్న ఔత్సాహిక యువ ఇంద్రజాలకులకు ఈ రంగంలో ప్రావీణ్యం కలిగిన ప్రముఖుల ఆశీస్సులు కూడా తోడైతే ఈ విద్య మరింత ప్రాచుర్యంలోకి వస్తుంది. ఈ క్రమంలో సూళ్లూరుపేట పట్టణంలో కూడా ఆయిదారుగురు ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తున్నప్పటికీ మండెం సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ ఎంఎస్‌రెడ్డి ఈ విద్యను నేర్చుకుని ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యం చేయడంతో ఎందరో ప్రముఖుల నుంచి అవార్డులు కూడా తీసుకున్నారు. ప్రజల్లో ఎప్పటి నుంచో పాతుకుపోయిన మూఢనమ్మకాలను తొలగించే క్రమంలో గ్రామాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చి ముందుకు సాగుతున్నారు ఎంఎస్‌రెడ్డి. సూళ్లూరుపేటలో చిన్న వ్యాపారం చేసుకుంటూ ఇంద్రజాలంపై మక్కువ పెంచుకుని ఇంద్రజాలకుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్‌ను గురువుగా చేసుకుని ఏకలవ్య శిష్యుడిగా ఈ విద్యతో పాటు మాట్లాడే బొమ్మ టెక్నిక్ కూడా నేర్చుకుని పలు వేదికలమీద ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ విద్యను నేర్చుకున్న అనతి కాలంలోనే కర్ణాటకలోని దావణగిరి, గుల్బర్గా, రాష్ట్రంలోని అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గూడూరు, విజయవాడ, హైదరాబాద్ ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ఇందులో జంతర్ మంతర్–2001 ప్రదర్శనలో క్రియేటివ్ మెజీషియన్‌గా గుర్తింపు పొందారు. ఇతని ఇంద్రజాల ప్రదర్శనలో ఆయా ప్రాంతాల విశిష్టతలకు అనుగుణంగా బొమ్మలు చేసి చూపించడం, ఒక తాడును తీసుకుని తుంటలుగా తెంచి దాన్ని ఎక్కడ ముడి లేకుండా దారాన్ని యథావిధంగా తీయడం, కడుపులోకి పెద్దకత్తి పోనిచ్చి బయటకు తీయడం లాంటి ఎన్నో విద్యలు చేయడం ఇతని ప్రత్యేకత. ఇంద్రజాల ప్రదర్శనల్లో మేటి అయిన నేరెళ్ల వేణుమాధవ్, బీవీ పట్టాభిరామ్, సీవీ రమణ, షాడో, క్రాంతికుమార్ లాంటి మన్ననలు కూడా అందుకోవడం విశేషం.

ప్రముఖుల నుంచి మెజీషియన్ అవార్డులు...

ఎంఎస్‌రెడ్డి చేసిన ప్రదర్శనలకు ఎన్నో అవార్డులు కూడా అందుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నపుడు అవార్డును అందుకున్నారు. ఆ తరువాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకమునుపే ఆయన ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ సినీ నటుడు అలనాటి అగ్రహీరో స్వర్గీయ నాగేశ్వరరావు, మెగాస్టార్ చిరంజీవి, బీవీ పట్టాభిరామ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. నేడు ప్రపంచ మ్యాజిక్ దినోత్సవం సందర్భంగా ఈ కథనం.

గిట్టుబాటు కంటే అధిక ధరలతో లాభాలు



చిల్లకూరులో గోడౌన్, వేబ్రిడ్జి, ఆర్బీకేలను పరిశీలిస్తున్న రాహుల్‌పాండే

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల గిట్టుబాటు ధర కంటే అధిక ధరలతో ధాన్యం విక్రయించడం వల్ల రైతులందరూ మంచి లాభాలు పొందుతున్నారని వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్, మార్క్‌ఫెడ్ సంస్థ ఎండీ రాహుల్‌పాండే అన్నారు. బుధవారం చిల్లకూరు వడ్డిపాళెంలో కొత్తగా నిర్మించిన వ్యవసాయ గోడౌన్, వేబ్రిడ్జితో పాటు చిల్లకూరులో జరుగుతున్న ఆర్బీకే భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విస్తృతంగా కురిసిన వర్షాలతో ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రమంతటా అన్నదాతలు అధిక దిగుబడులు సాధించారన్నారు. గడిచిన మూడేళ్లల్లో సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు పెరిగినట్లు గణాంకాలు ద్వారా తెలుస్తోందన్నారు. కొత్తగా నిర్మించిన గోదాములతో ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కలిగిందన్నారు. వ్యవసాయ శాఖ డీఎం పవన్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారీలకు విక్రయించి నష్టాలు బారిన పడకుండా రైతులందరికి అందుబాటులో నిర్మించిన వేబ్రిడ్జిలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ పాల్గొన్నారు.

నిందితుడు అరెస్ట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

సైదాపురం: బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన కేసులో నిందుతుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మలిచేడు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన మందా ప్రసాద్ (26) పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. నిందితుడికి ఇదివరకే పెళ్లై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ప్రసాద్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఏడాది క్రితం భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాలిక ఒత్తిడి తేవడంతో ఆమెను వేధించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించిందని దీంతో తల్లిదండ్రులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారని డీఎస్పీ పేర్కొన్నారు. తలుపూరు క్రాస్ రోడ్డు వద్ద నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. డీఎస్పీ వెంట సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ నాగబాబు ఉన్నారు.

ఏపీ ఎన్జీఓ మహిళా కమిటీ ఎన్నిక



ఏపీ ఎన్జీఓ మహిళా కమిటీ సభ్యులు

గూడూరు: గూడూరు తాలూకా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఎస్.వి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గూడూరులోని ఎన్జీఓ అసోసియేషన్ భవనంలో గూడూరు తాలూకా మహిళా విభాగం ఎన్నికలు జరిగాయి. మహిళా అధ్యక్షురాలిగా పి.సమత, సహాధ్యక్షులుగా ఎ.సంధ్య, ఉపాధ్యక్షులుగా కె.పుట్టమ్మ, ఎ.జ్యోతి, ఎం.ఉమామహేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎ.రమ్య, ఆర్గనైజింగ్ సెక్రటరిగా వై.ప్రవీణ, సహాయ కార్యదర్శిగా జి.వి.శివపార్వతి, ఎం. వింధ్యారాణి, పి.రాజేశ్వరి, ట్రెజరర్‌గా ఎస్.కృష్ణమ్మ, ఈసీ మెంబరుగా కె.పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షురాలు ఈ.కరుణమ్మ, జిల్లా మహిళా చైర్‌పర్సన్ యు.చిన్నమ్మ వ్యవహరించారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.నాగరాజకుమార్, సెక్రటరీ ఓ.తనూజ్‌కుమార్, ట్రెజరర్ పి.అశోక్, మహిళా జాయింట్ సెక్రటరి సుజనమ్మ, వైస్ ప్రెసిడెంట్ ఎ.కల్యాణ్‌సాయి, ఈసీ మెంబర్లు శివకుమార్‌రెడ్డి, ఎస్.కె.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

భరత నాట్యంలో షమ్రితకు అవార్డు



లలితరాణి చేతుల మీదుగా శివనంది అవార్డును అందుకున్న షమ్రిత యాదవ్

గూడూరురూరల్: పట్టణంలోని తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఉడతా షమ్రిత యాదవ్‌కు భరత నాట్య విభాగంలో శివనంది అవార్డు దక్కింది. కర్ణాటక రాష్ట్రం హొస్పేట(హంపి)లో ఈనెల 18, 19, 20 తేదీల్లో మహాశివరాత్రి సందర్భంగా సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ఫ్రైడ్ ఇండియా కల్చరల్ ఆధ్వర్యంలో జాతీయ నృత్య సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా గూడూరు సంస్కృతి సమ్మేళనం, పొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత, నృత్య పాఠశాల, శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం ప్రిన్సిపల్ పిండి మల్లిక ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న షమ్రిత యాదవ్‌కు శివనంది అవార్డును నిర్వాహకులు ప్రకటించారు. ఆనెగొంది సంస్థానం, శ్రీకృష్ణదేవరాయల వంశస్తురాలు లలితారాణి చేతులమీదుగా అవార్డు, ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను అందజేశారు. షమ్రిత యాదవ్‌కు శివనంది అవార్డు దక్కడంపై పలువురు కళాభిమానులు అభినందనలు తెలిపారు.

దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని దోమల నివారణకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ముమ్మరంగా ఫాగింగ్ చేస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బందితో రాత్రి వేళల్లో దోమలను నివారించేలా ఫాగింగ్ చేయిస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లోని డ్రైనేజీ కాలువల్లో దోమలను నివారించేలా మందు పిచికారీ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

40 రోజుల ధ్యాన ప్రార్థనలు ప్రారంభం

వాకాడు: మండల కేంద్రంలోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో బుధవారం 40 రోజుల ఏసుప్రభువుని శ్రమల కాలపు ధ్యానముల కార్యక్రమాన్ని క్రైస్తవులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి సంఘ కాపరి ఎస్ ప్రశాంత్‌బాబు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి ఏప్రిల్ 8వరకు 40 రోజులపాటు ప్రతిరోజూ సాయంత్రం క్రైస్తవులు ఉపవాసాలతో ప్రత్యేక ధ్యాన ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నేతలతో సమీక్ష

సైదాపురం: మండలకేంద్రంలో గురువారం మధ్యాహ్నం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని ఆయన కోరారు.

హుండీ ఆదాయం

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో బుధవారం దేవదాయశాఖ, ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.11లక్షల 545 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టండి



దిగువమార్లగుంట: విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

దక్కిలి: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధన అందించాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. దిగువమార్లగుంటలో ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వివిధ రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

నిధుల అవకతవకలపై విచారణ నేడు

చిల్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో నిధుల వినియోగం అవకతవకలపై గురువారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ జరగనుంది. మండల పరిషత్ కార్యాలయంలో నిధుల వినియోగానికి సంబంధించి ఇటీవల పలు ఆరోపణలు రావడంతో ఎంపీపీ వెంకటరమణమ్మ కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి అవకతవకలపై విచారణ చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ స్పందించి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. విచారణను గురువారం నిర్వహిస్తున్నామని సబ్‌కలెక్టర్ తెలిపినట్లు తెలిసింది.

కారును ఢీకొన్న లారీ

గూడూరు: పట్టణ సమీపంలోని చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియన లారీ ముందు వెళుతున్న కారును ఢీకొంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం నెల్లూరులో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి కారులో వెళుతోంది. గూడూరు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని లారీ కారును ఢీకొంది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 45.727 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 45.727 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,210క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 130, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీజ్‌కు120, హైలెవల్ స్లూయీజ్‌కు 140క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కష్టపడే వారికి సముచిత స్థానం



నామినేషన్ వేసేందుకు ఇంటి నుంచి బయలుదేరుతున్న మేరిగ మురళీధర్

- మేరిగ మురళీధర్



రాపూరు నుంచి..



మేరిగ మురళీధర్ నామినేషన్‌కు కోట నుంచి బయలుదేరిన నాయకులు

గూడూరు: పార్టీ కోసం కష్టపడిన వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఇవన్నీ ఇలాగే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో ఉన్న మేరిగ మురళీధర్ నివాసంలో బుధవారం నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కార్ల ర్యాలీతో నెల్లూరులో నామినేషన్ వేసేందుకు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ గూడూరు మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, నేతలు యద్దల నరేంద్రరెడ్డి, కాంద్ర నారాయణరెడ్డి, గూడూరు శ్రీనివాసులు రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు తాళ్లూరు శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు గఫూర్, నాగిశెట్టి శారద, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, కొట్టు అశోక్, విద్యాసాగర్, మురళీరెడ్డి, దయాకర్ పాల్గొన్నారు.

రాపూరు మండలం నుంచి..

రాపూరు: మేరిగ మురళీధర్ నెల్లూరు కలెక్టరేట్‌లో బుధవారం నామినేషన్ కార్యక్రమానికి రాపూరు మండలం నుంచి భారీస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరివెళ్లారు. నేతలు పాపకన్ను దయాకర్ రెడ్డి, దందోలు నారాయణరెడ్డి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఖాదర్‌బాషా, మధురెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి ప్రకాష్‌రెడ్డి, రమణయ్య నెల్లూరుకు తరలివెళ్లారు.

కోట: కోట నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో ర్యాలీగా నెల్లూరుకు వెళ్లారు. కోట సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ గాది భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, పరంధామరెడ్డి, మాజీ సర్పంచ్ ఆనందమూర్తి తరలివెళ్లారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



కట్టా వెంకట రమణారెడ్డిని కలిసిన యూనియన్ నేతలు

నాయుడుపేటటౌన్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అందరూ అండగా నిలవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ఎన్‌డీసీసీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కట్టా వెంకటరమణారెడ్డి ఆ సంఘ నాయకులు కోరారు. పట్టణంలోని ఆయన నివాసం వద్ద కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియన్ (వైఎస్సార్ టీయూసీ) నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూనియన్ చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి చేయూత అందించాలని, అసోసియేషన్ బలో పేతం చేసేందుకు చేస్తున్న చర్యలపై రమణారెడ్డి తో చర్చించారు.ఈ కార్య క్రమంలో. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కుమార్ , జిల్లా డిప్యూటీ ప్రదాన కార్యదర్శి చెంగయ్య, యూనిట్ కార్యాదర్శి సుకుమార్ ఉన్నారు.


ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియలో వెంకటగిరి నేతలు



నామినేషన్ కార్యక్రమంలో బాలినేనితో కలిసి పాల్గొన్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగింది. కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇంకా పేర్నాటి నామినేషన్ కార్యక్రమంలో వెంకటగిరి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీలను అభివృద్ధిపథంలో నిలిపేందుకు కార్యాచరణ



దుకాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌పాండే

నాయుడుపేటటౌన్: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తూ నిధులను సైతం మంజూరు చేస్తోందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్‌పాండే తెలిపారు. పట్టణంలోని నూతన ఏఎంసీ కార్యాలయ భవనం, ఏఎంసీ ఆవరణలో నూతన దుకాణాల సముదాయాన్ని బుధవారం కమిషనర్ పరిశీలించారు. నూతన దుకాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం పాటలు వేసి అద్దెకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని, అదే విధంగా శిథిలావస్థలోత ఉన్న భవనాన్ని పడగొట్టాలని సూచించారు. ఇందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఏఎంసీ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ, సహాయ కార్యదర్శి షేక్ ఇలియాజ్‌లను ఆదేశించారు. కమిషనర్‌ను చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి శాలువ కప్పి సత్కారించారు. కమిషనర్ వెంట వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, తిరుపతి ఏడీటీ సురేంద్రబాబు, ఈఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పుదూరు అంబేడ్కర్ బాలికల గురుకులంలో బుధవారం విద్యార్థినులకు కిశోర బాలికల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పుదూరు సచివాలయ మహిళా పోలీస్ సీహెచ్ లక్ష్మి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పద్మజ, వైస్ ప్రిన్సిపల్ తన్నీరు శశికళ, ఉపాధ్యాయురాళ్లు సావిత్రమ్మ, సుజాత, సుమ, గీత, సునీత, ప్రమీల పాల్గొన్నారు.